మద్దతు కోరిన ఎంపీ అభ్యర్థి 'రాగిడి'

మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

ఉప్పల్, మార్చి 17 : మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్‌పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఆదివారం పలువురిని కలిశారు. ఈమేరకు పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రముఖులను కలిసి మద్దతు కోరారు. ఈ మేరకు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. అదేవిధంగా ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్‌ను కలిసి గెలుపు కోసం తోడ్పాటు అందించాలని కోరారు. వీరితోపాటుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు శంబీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జితేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

బాధిత కుటుంబాలకు చెక్కులను అందజేస్తున్న కార్మిక మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు మస్తాన్‌బీ

జవహర్‌నగర్, మార్చి 17: కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుదామని కార్మిక మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు మస్తాన్‌బీ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో కార్మిక మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మస్తాన్‌బీ మాట్లాడుతూ కార్మికులు సంక్షేమ బోర్డులో పేరును నమోదు చేసుకుంటేనే... తమ కుటుంబానికి ఆర్థిక భరోసా కలుగుతుందని, కార్డుపొందిన వారు ప్రతి సంవత్సరం రెన్యూవల్ చేసుకోవాలని పేర్కొన్నారు. సహజ మరణం పొందిన వారికి రూ.1.30లక్షలు, ప్రమాదానికి గురైతే రూ.30వేలు సంక్షేమ బోర్డు అందజేస్తుందని తెలిపారు. భర్తలు మరణించగా వారి కుటుంబాలైన లలిత, రాధమ్మకు ఒక్కోరికి రూ.1.30చొప్పున అందజేయగా, ప్రమాదానికి గురైన నలుగురికి ఒక్కొక్కరికి రూ.30వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సవితాగౌడ్, మిరా, నాగమణి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటుపై గంగపుత్రుల హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న గంగపుత్ర నాయకులు

రామంతాపూర్,మార్చి 17: గంగపుత్రుల కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడంపై గంగ పుత్రులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు తవిడబోయిన గిరిబాబు ఆధ్వర్యంలో ఆదివారం రామంతాపూర్ ప్రధాన రహదారిలో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద సీఎంరేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం గంగపుత్రులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తయ్య,సైదులు, సత్యనారాయణ,సాయిలు,మంగ రవి,గొంగిడి సుబ్రమణ్యం,పంది సత్యనారాయణ,పెద్ద పల్లి కృష్ణ,పబ్బు గణేశ్,కాయ ఉపేందర్, అంబటి వెంకటేశ్,సత్యనగర్ కృష్ణ, కాయ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వైద్య పరీక్షలు చేయించుకొంటున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

రామంతాపూర్, మార్చి 17: కీర్తిశేషులు రామ్‌దాస్ అగర్వాల్ జయంతి సందర్భంగా రామంతాపూర్ ప్రధాన రహదారిలో నల్లపోచమ్మ ఆలయం వద్ద ఐవీఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని పర్యాటక సంస్థ మాజీ చైర్మన్, ఐవీఎఫ్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఆదివారం ప్రారంభించారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ వైద్యశిబిరంలో ఉచిత వైద్యపరీక్షలు చేయించుకున్నారు. రోగులకు మందులు అందజేశారు.

ఈ కార్యక్రమంలోఐవీఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సంబుపాండయ్య గుప్తా, ప్రధాన కార్యదర్శి కొత్త పల్లి రమేశ్ గుప్తా, స్టేట్ ఐవీఎఫ్ ఆధ్యాత్మిక చైర్మన్ శ్రీనివాస్ గుప్తా,ఊరె నాగేశ్‌గుప్తా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను కలిసిన బీఆర్‌టీయూ నేతలు



ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్‌టీయూ నేతలు

ఉప్పల్, మార్చి 17: బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ కుట్రలను వ్యతిరేకించి బీఎస్పీకి రాజీనామా చేసిన ఆయన నిర్ణయాన్ని స్వాగిస్తున్నట్లు చెప్పారు. బహుజన సంక్షేమం కోసం బీఆర్ఎస్‌పార్టీలో చేరి, బీఆర్ఎస్ అధినేతతో కలిసి నడవాలని కోరారు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న బీజేపీ, కాంగ్రెస్‌పార్టీకి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి రూప్‌సింగ్, నారాయణ, వేముల మారయ్య, తదితరులు పాల్గొన్నారు.

అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న సీసీఎస్ ప్రతినిధులు

చర్లపల్లి, మార్చి 17: అనుమానితులు కాలనీల్లో కనిపిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని చర్లపల్లి కాలనీల సమాఖ్య ప్రతినిధి ఎంపెల్లి పద్మారెడ్డి పేర్కొన్నారు.

చర్లపల్లి డివిజన్ పరిధిలోని శ్రీ సాయి కృష్ణ ఎన్‌క్లేవ్ కాలనీలో ఆదివారం ఉదయం ఓ ఇంట్లోకి చొరబడ్డ అనుమానితుడిని కాలనీవాసులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల అదుపులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అనుమానితులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కుమార్‌స్వామి,కాలనీవాసులు ఉన్నారు.

డబుల్ ఇండ్లల్లో సమస్యలు పరిష్కరిస్తా:ఎమ్మెల్యే

కాప్రాసాయిబాబానగర్ డబుల్ఇండ్లలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

మల్లాపూర్: కేఎల్‌రెడ్డినగర్‌లో కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డితో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కాప్రా, మార్చి 17: కాప్రాడివిజన్ సాయిబాబానగర్ సమీపంలో నిర్మించిన డబుల్‌బెడ్రూమ్ ఇండ్లల్లో సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం డబుల్ ఇండ్ల యజమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేను స్థానికులు శాలువాతో ఘనంగా సత్కరించి వారి సమస్యలు వివరిస్తూ వినతిపత్రం ఇచ్చారు. తాగునీరు, లిఫ్ట్ సమస్యలను పరిష్కరించాలని వారు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేయగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నవీన్‌గౌడ్, బంక వెంకటేష్, వస్త్రాల వెంకటేశ్, గౌస్, విజయ్, రవీందర్‌రెడ్డి, దుర్గేష్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

మల్లాపూర్: ప్రతి కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. ఆదివారం ఆయన మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కేఎల్‌రెడ్డినగర్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు దుకాణ సముదాయాలు, కార్యాలయాల వద్దనే కాకుండా కాలనీవాసులు ఐక్యంతో ఉండి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, యాకూబ్‌రెడ్డి, లక్ష్మి, జయశ్రీ, బీఆర్ఎస్ నాయకులు వాసుగౌడ్ ఉన్నారు.

ఉచిత కుట్టుమిషన్ శిక్షణ శిబిరం షురూ..

కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న డిప్యూటీమేయర్ లక్ష్మీరవిగౌడ్

బోడుప్పల్, మార్చి17: మహిళల ఆర్థిక స్వావలంభనే లక్ష్యంగా బోడుప్పల్ బీఆర్ఎస్ 15వ డివిజన్ ఇన్‌చార్జి సిగురు రేణుక రవికుమార్ చేస్తున్న కృషి అభినందనీయమని డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్ అన్నారు.

ఆదివారం సిగురు రేణుక రవికుమార్ సొంత నిధులతో 200మంది మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో టెలిఫోన్ కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, రవికుమార్, అంజయ్య, ఆరోగ్యమేరి, తాల్క శత్రజ్ఞ,మహేశ్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఘట్‌కేసర్,మార్చి17: ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం12.30వరకు పరీక్ష జరుగుతుందని ఎంఈఓ శశిధర్ తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన మొత్తం 8 కేంద్రాల్లో 1460 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. విద్యార్థులు పరీక్షా సమయానికి ముందే కేంద్రాలకు చేరుకోవాలని ఆయన సూచించారు. సెల్‌ఫోన్లు, ఎలాంటి పేపర్లను వెంట తీసుకు రావద్దని సూచించారు.

మంత్రికి సమస్యలపై వినతి

రామంతాపూర్,మార్చి17: రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార,ప్రజా సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఆదివారం ఉప్పల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గడ్డం రవికుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యలు వివరించారు.

నేడు మహాన్యాస రుద్రాభిషేకం

కీసర, మార్చి 17: కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామికి సోమవారం మహాన్యాప పూర్వక రుద్రాభిషేకాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ నాగలింగంశర్మ తెలిపారు.

ఎండోమెంట్ కిందకు హనుమాన్ ఆలయం

కీసర, మార్చి 17: కీసర మండలం భోగారంలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం ధూపదీప నైవేద్యం కింద ఎంపికైంది. ఈ ఆలయానికకి ధూపదీప నైవేద్యం కింద ఎంపిక కోసం రెండు సంవత్సరాల క్రితం ఎండోమెంటోకు దరఖాస్తు చేశారు. ఎండోమెంటో శాఖ వారు ఎట్టకేలకు స్పందించి ఈ ఆలయాన్ని ధూపదీప నైవేద్యం కింద ఎంపిక చేయడంతో పాటు ప్రత్యేక పంతులును నియమించి వారికి నెలకు రూ.10వేల గౌరవ వేతనం మంజూరు చేయడం జరిగింది.

పేదలకు అండగా బీఎల్ ఆర్ ట్రస్టు

చర్లపల్లి,మార్చి17: పేదలకు బీఎల్ఆర్ ట్రస్ట్ అండగా ఉంటుందని ఏఎస్‌రావునగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు కాసం మహిపాల్‌రెడ్డి, కుమార్‌స్వామి అన్నారు. ఏఎస్‌రావునగర్ డివిజన్ జమ్మిగడ్డ జైకిసాన్ కాలనీలో మృతి చెందిన ఏసు కుటుంబ సభ్యులకు బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో బీఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడంతో పాటు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పేదలను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు శేర్ మణెమ్మ, బీఆర్ఎస్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు శిరీషారెడ్డి, రమాదేవి, లక్ష్మినారాయణ, రహీం, దుర్గా, చిన్నారావు, మాట్లగిరి, భూపతిరెడ్డి, మొగులయ్య, సత్తెమ్మ, సరిత, ప్రమోద్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జమ్మిగడ్డ జైకిసాన్ కాలనీలో మృతి చెందిన ఏసు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

అ'పూర్వ' సమ్మేళనం

కీసర, మార్చి 17: 50 సంవత్సరాలు పూర్తి చేసుకొని తన తోటి స్నేహితులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని కీసరగుట్ట ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, కీసర ఎంపీటీసీ తటాకం నారాయణశర్మ అన్నారు. జడ్పీ హైస్కూల్ ఘట్‌కేసర్‌లో 1974 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకొన్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని కీసరగుట్టలో ఎంపీటీసీ తటాకం నారాయణశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఆనాటి పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి నాటి మధురానుభూతులను నెమరేసుకున్నారు. ఈ సందర్భంగా నారాయణశర్మ మాట్లాడుతూ తాము 10వ తరగతి అయిపోయి 50 వసంతాలు పూర్తి చేసుకోవడం, తోటి స్నేహితులు వివిధ హోదాల్లో ఉండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహించుకోవాలని తీర్మానం చేసుకొన్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు ఎల్లయ్య, వెంకటరాంరెడ్డి, పూర్వ విద్యార్థులు విఠలేశ్వర్‌రావు, నర్సింగ్‌రావు, నర్సింహరావు, ఆంజనేయులు, హన్మంత్‌రావు, పెంటయ్య, దశరథ, మానస, గుణసుందరి,శారదపాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం

శామీర్‌పేట, మార్చి 17: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... రాజీవ్ రహదారిపై హైదరాబాద్-కరీంనగర్ వెళ్లే దారిలో శామీర్‌పేట మండలం అలియాబాద్ రెవెన్యూ పరిధిలో సోనిదాబా దగ్గరలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గమనించిన పోలీసులు శవపంచనామా నిర్వహించారు. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి అక్కడికక్కడే మృతి చెంది ఉంటాడని నిర్ధారించుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు.

వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 9490617142, 9490617231 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో..

కీసర: కీసర పోలీసుస్టేషన్ పరిధిలో గుర్తు తెలియన మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధి యాద్గార్‌పల్లిలోని ఔటర్‌రింగ్‌రోడ్డు సర్వీసు రోడ్డు పక్కన గుర్తు తెలియని కుళ్లిపోయిన మృతదేహాన్ని సీఐ వెంకటయ్య కనిపెట్టారు. వ్యక్తి వయస్సు సుమారు 30 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని, బట్టతల ఉండి విగ్ ధరించి ఉన్నాడని బ్రౌన్ కలర్ అండర్ వేర్ వివరాలకు 8712662107,8712662107,8712662114 సెల్‌ఫోన్ నెంబర్‌లకు సంప్రదించాలని కోరారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

ఉప్పల్, మార్చి 17: డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టామని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. చిలుకానగర్ డివిజన్ శ్రీనగర్‌కాలనీవాసులు ఆదివారం పరమేశ్వర్‌రెడ్డిని కలిశారు. ఈమేరకు డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి మంజూరు చేసిన రూ.25 లక్షల ప్రొసిడింగ్ కాపీని కాలనీవాసులకు అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సుధీర్, యాదయ్య, బాలరెడ్డి, రాంరెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్, వేణుగోపాల్‌రెడ్డి, బ్రహ్మచారి, చంద్రం, జగదీష్, సంతోష్ పాల్గొన్నారు.



మంజూరు పత్రం అందజేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

రాజగోపురం నిర్మాణానికి సన్నాహాలు

నేరేడ్‌మెట్‌లోని శ్రీ కాశీ విశ్వనాథ ఆలయంలో రాజగోపురం నమూనా ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న భక్తులు

మల్కాజిగిరి, మార్చి 17: శ్రీ అన్నపూర్ణ సహిత శ్రీ కాశీ విశ్వనాథ ఆలయంలో రాజగోపురం నిర్మాణ ప్రాజెక్ట్‌ను ప్రారంభించామని ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రావు అన్నారు. ఆదివారం ఆలయంలో రాజగోపురం నమూనా ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమేశ్, ప్రెసిడెంట్ రాజారామ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.రాజు, ప్రధాన కార్యదర్శి గంగాధరి రాజు, సువర్ణలక్ష్మి, శివకుమార్, సత్యనారాయణ, అశోక్, గంగాధరి కృష్ణ, గణేశ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహన ర్యాలీ

చర్లపల్లి, మార్చి 17: ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని ఈసీఐఎల్ చౌరస్తాలో సోలిస్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో గ్లకోమా వీక్ సందర్భంగా ర్యాలీ నిర్వహించి వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ గ్లకోమా అనేది ఆప్టిక్ నరాలకు హాని కలిగించే వ్యాధి అని, ఆప్టిక్ నరాలు దెబ్బతినడం వల్ల అంధత్వం ఏర్పడొచ్చని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అశోక్, ఆనంద్, నమ్రత తదితరులు పాల్గొన్నారు.

ఈసీఐఎల్ చౌరస్తాలో గ్లకోమాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

ఆస్తిపన్ను పరిష్కార వేదికకు స్పందన

కాప్రాసర్కిల్ కార్యాలయంలో జరిగిన ఆస్తిపన్ను పరిష్కారవేదికలో పాల్గొన్న కాప్రా సర్కిల్ రెవెన్యూ విభాగం అధికారులు

కాప్రా, మార్చి 17: కాప్రాసర్కిల్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆస్తిపన్ను పరిష్కారవేదికకు నాలుగు దరఖాస్తులు అందాయి. ఆయా దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కాప్రాసర్కిల్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ షానవాజ్ తెలిపారు. ఆస్తిపన్నులకు సంబంధించి ఆస్తిపన్ను మదింపు, ఆస్తిమార్పిడి, టైటిల్ తప్పులు ఏవైనా జరిగి ఉంటే ఆయా సమస్యలపై ప్రతి ఆదివారం నిర్వహించే పరిష్కార వేదికను సంప్రదించి దరఖాస్తులు అందజేస్తే నిబంధనలను అనుసరించి వాటిపై చర్యలు తీసుకుంటామని ఏఎంసీ షానవాజ్, విజయ్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసీ నాగార్జున, జహంగీర్ పాషా, పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

కృష్ణమూర్తి(ఫైల్

జవహర్‌నగర్, మార్చి 17: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం..యాప్రాల్‌లోని జేజేనగర్‌లో కృష్ణమూర్తి కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. కృష్ణమూర్తికి(35)కి మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో ఇంటి వద్దనే ఉంటాడు. ఈ నెల 8న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదు. దీంతో కృష్ణమూర్తి ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. ఇతనికి మూర్ఛవ్యాధి కూడా ఉందని తెలిపారు. ఈ మేరకు కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం పలువురు నృత్యకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రదర్శనల్లో విశాఖపట్నం నుంచి విచ్చేసిన 'కళారాధన మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ' గురువులు తాళ్ళపాక సందీప్ కుమార్ తన శిష్యబృందంతో కలిసి కూచిపూడి నృత్యరూపకంలో కళాకారులు నర్తించిన తీరు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. – కొండాపూర్, మార్చి 17

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డ్ 6వ ఫేజ్‌లోని విజయ కనకదుర్గ దేవాలయం వార్షికోత్సవం వైభవంగా జరిగాయి. ఆదివారం ఆలయం ప్రాంగణంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు. –బాలానగర్

30న 'ఏఐ డేస్-2024' కాన్ఫరెన్స్

శేరిలింగంపల్లి, మార్చి 17: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హబ్‌గా త్వరలో హైదరాబాద్ నగరం మారనుందని స్వేచ్ఛ తెలంగాణ వ్యవస్థాపకుడు వై.కిరణ్ చంద్ర అన్నారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్ విభాగాల్లో ప్రతిష్టాత్మకమైన కాన్ఫరెన్స్ ''ఏఐ డేస్-2024''పేరిట రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ఈనెల 30, 31 తేదీల్లో నగరంలోని జేఎన్‌టీయు వేదికగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో 2000 మందికి పైగా ఐటీ నిపుణులు, పరిశోధకులు, స్టార్టప్ నిపుణులు, విద్యార్థులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ సదస్సుతో హైదరాబాద్ నగరం ఏఐ రాజధానిగా మారేందుకు మార్గం సుగమం కానుందని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఉద్యోగాలు పోతాయనడంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సాల్ మందార్ సీనియర్ సలహాదారుడు నాగేంద్రనాథ్, ఓజోన్‌టెల్ సీఈఓ చైతన్య, స్వేచ్ఛ తెలంగాణ అధ్యక్షుడు ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి,ప్రముఖులు ఉన్నారు.

మాట్లాడుతున్న స్వేచ్ఛ తెలంగాణ వ్యవస్థాపకుడు వై.కిరణ్‌చంద్ర

పోలీస్ పికెటింగ్

బాలానగర్, మార్చి 17: ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో కేపీహెచ్‌బీకాలనీ పోలీసులు ఆదివారం కేపీహెచ్‌కాలనీ సీఐ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేస్తున్నట్లు ప్రకటించారు.ప్రజలు పోలీసులతో సహకరించాలని సూచించారు.